క్లుప్తంగా

లోతట్టు ప్రాంతాలపై ప్రత్యేక దృష్టి


కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ: వర్షాకాలంలో నగరంలోని లోతట్టు ప్రాంతాలు ముంపునకు గురి కాకుండా చర్యలు చేపట్టాలని అధికారులను కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. ఈ మేరకు బుధవారం కలెక్టరేట్‌లో నగరపాలక సంస్థ అధికారులతో సమీక్షించారు. ఆమె మాట్లాడుతూ వర్షాల సమయంలో ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందికర పరిస్థితిపై అంచనా వేయాలన్నారు. ప్రధానంగా హైటెక్ బస్టాండ్, తుమ్మలావ, కృష్ణానగర్, రైల్వేస్టేషన్ రోడ్డు, వీఎల్ పురం సహా నగరంలోని 13 ప్రాంతాలు ముంపుకు గురవుతున్నాయన్నారు. వీటిపై ప్రత్యేక శ్రద్ధ వహించాలన్నారు. నీటిని తోడేందుకు ఉపయోగిస్తున్న డ్రైనేజీ పంపింగ్ స్టేషన్లు పనిచేస్తున్నాయో, లేదో పరిశీలించాలన్నారు. వర్షపునీరు రోడ్లపై నిల్వ ఉండకుండా డ్రైనేజీల్లో చెత్తను ఎప్పటికప్పుడు తొలగించాలన్నారు. సమావేశంలో ఎస్ఈ (ఇంజినీరింగ్) ఎంసీహెచ్ కోటేశ్వరరావు, ఎంహెచ్ఓ ఎ.వినూత్న, డీసీపీ శ్రీనివాస్, ఈఈలు మాధవి, రీటా, అలీ షేక్, సీటీసీ రవితేజ పాల్గొన్నారు.

రేపు విద్యుత్ అంతరాయం

రాజమహేంద్రవరం సిటీ: మరమ్మతుల నేపథ్యంలో నగరంలోని పలు ప్రాంతాల్లో శుక్రవారం విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ నక్కపల్లి శామ్యూల్ తెలిపారు. ఆ రోజు ఉదయం 8 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు స్టేడియం రోడ్డు, టి.నగర్, శ్యామల థియేటర్ రోడ్, గోదావరి గట్టు, అజ్జరపువారి వీధి, వైగ్రామ్ రోడ్డు, చల్లపల్లివారి వీధి, ఇస్కాన్ టెంపుల్, గోదావరి బండ్, మెయిన్ రోడ్డు, కోటగుమ్మం, చాంబర్ ఆఫ్ కామర్స్, నాళం భీమరాజు వీధి, నల్ల మందు సందు, రంగ్రీజు పేట, చందా సత్రం, శంకర మఠం, వంకాయల వారి వీధి, కొబ్బరి కాయల మార్కెట్, సాయికృష్ణ థియేటర్ రోడ్, మంగళవారపు పేట, జెట్టి కాంప్లెక్స్, కుమ్మరి వీధి, శ్యామలాంబ రోడ్, భావనారుషి గుడి వీధి మొదలగు ఏరియాల్లో అంతరాయం కలుగుతుందన్నారు.

విద్యార్థి మిత్ర కిట్ల పంపిణీ

కడియం: మండలంలోని దుళ్ల హైస్కూలు విద్యార్థులకు డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ విద్యార్థి మిత్ర కిట్లను బుధవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా దుళ్ల ఉప సర్పంచ్ తోకల శ్రీనివాసరావు, మాజీ సర్పంచ్ గుర్రపు సత్యనారాయణ మాట్లాడుతూ ప్రభుత్వం అందించిన ప్రోత్సాహాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. అలాగే స్కూలు నుంచి బదిలీపై వెళుతున్న పీడీ ఎం.జయకుమార్‌ను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో ఎస్ఎంసీ చైర్మన్ చింతా శ్రీనివాస్, స్థానిక నాయకులు తదితరులు పాల్గొన్నారు.

గొడుగులు, బియ్యం వితరణ


బాలికలకు గొడుగులు, బియ్యం అందించిన దాత

కంబాలచెరువు: దానవాయిపేటలోని బాల సదనం బాలికల వసతి గృహంలో బాలికలకు బుధవారం వీటీ కళాశాల విశ్రాంత ప్రధానాచార్యులు ఎ.శాంతకుమార్ వితరణ చేశారు. విద్యార్థులకు గొడుగులు, యాభై కేజీల బియ్యం, బిస్కెట్ ప్యాకెట్లు అందించారు. ఈ సందర్భంగా పీఎంపీ జిల్లా అధ్యక్షుడు బళ్ల శ్రీనివాసరావు మాట్లాడుతూ బాలికలకు సహాయం అందించిన ఎ.శాంతకుమార్‌కు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో సదనం సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సినిమాలు



శ్యామల	: థగ్ లైఫ్
సూర్య మినీ	: బల్లెరినా
సూర్య ప్యాలెస్	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
స్వామి	: ది హంటర్, శ్రీశ్రీశ్రీ రాజావారు
శివజ్యోతి	: కట్టప్ప జడ్జిమెంట్, పాపా (ఓ నాన్నా)
అనుశ్రీ	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
రాజా	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
ఊర్వశి	: అందాల రాక్షసి
మేనక	: శుభం, పాడేరు 12వ మైలు
రంభ	: ఫైనల్ డెస్టినేషన్
అప్సర	: సింగిల్
అశోక	: భైరవం
నామవరం వీఎస్ మహల్	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
ధవళేశ్వరం మురళీకృష్ణ	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్
కడియం వెంకటసూర్య	: హౌ టు ట్రైన్ యువర్ డ్రాగన్

వేమగిరి ర్యాంపులో అక్రమ తవ్వకాలు


సమావేశంలో మాట్లాడుతున్న సతీష్‌చంద్ర స్టాలిన్, చిత్రంలో సభ్యులు

- అక్కడ నిబంధనలు వర్తించవా?
- మండల పరిషత్ సమావేశంలో ప్రశ్నించిన స్టాలిన్
- ప్రజల ప్రయోజనాల కోసం పనులు చేయండి : గిరజాల వీర్రాజు

కడియం: గ్రీన్ ట్రిబ్యునల్ నిబంధనల మేరకు జిల్లాలోని అన్ని ర్యాంపులు ఈ నెల ఒకటో తేదీనే నిలిచిపోతే వేమగిరి – బుర్రిలంక ర్యాంపులో మాత్రం ఇసుక తవ్వకాలు కొనసాగుతున్నాయని, ఈ ర్యాంపునకు ఏమైనా ప్రత్యేక అనుమతులు ఉన్నాయా అని జేగురుపాడు సర్పంచ్ యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మండల పరిషత్ సమావేశంలో అధికారులను నిలదీశారు. స్థానిక మండల పరిషత్ సర్వసభ్య సమావేశం ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అధ్యక్షతన బుధవారం జరిగింది. ఈ సందర్భంగా పలు ప్రజా సమస్యలను సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చారు.

అక్రమంగా తరలింపు

స్టాలిన్ మాట్లాడుతూ నిబంధనల మేరకు ర్యాంపును మూసివేస్తున్నట్లు అక్కడ బ్యానర్ కట్టి మరీ అక్రమంగా ఇసుకను తరలిస్తున్నారన్నారు. నిబంధనలతో పాటు కలెక్టర్ ఆదేశాలను సైతం పక్కన పెట్టి అక్రమ తవ్వకందారులను స్థానిక అధికారులు ప్రోత్సహిస్తున్నారని, రోజుకు 600 ట్రాక్టర్లకుపైగా ఇసుక తవ్వి తీసుకుపోతున్నారన్నారు. ఒక్కో ట్రాక్టర్‌పైన రూ.300 అదనంగా వసూలు చేసి పేదల జేబులు గుల్ల చేస్తున్నారన్నారు.

- జేగురుపాడు నంబర్ 2 పాఠశాలను మోడల్ స్కూల్‌గా అప్‌గ్రేడ్ చేయాల్సి ఉన్నప్పటికీ, ఎందుకు చేయడం లేదని సర్పంచ్ స్టాలిన్.. విద్యాశాఖాధికారులను ప్రశ్నించారు. రాజకీయ కారణాలతోనే అప్‌గ్రేడేషన్ జరక్కపోతే న్యాయ పోరాటానికి కూడా సిద్ధమవుతానని హెచ్చరించారు. రైతులను నీటి తీరువా పేరుతో దోచుకోవడం సమంజసం కాదన్నారు. ఈ తీరువాను గత ప్రభుత్వం రద్దు చేసిందని గుర్తు చేశారు.
- విద్యుత్ కనెక్షన్ల మంజూరు తదితర సేవలకు తాత్కాలిక సిబ్బంది భారీగా వసూళ్లు చేస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని స్టాలిన్ అన్నారు. అటువంటి వాటిపై సంబంధిత శాఖ ఉన్నతాధికారులు దృష్టి పెట్టాలని కోరారు.
- గత ప్రభుత్వం మంజూరు చేసిన లేఅవుట్లలో ఇంకా ఇల్లు నిర్మించుకోలేని వారు.. ఇప్పుడొచ్చిన ప్రభుత్వం రెండు సెంట్ల కంటే ఎక్కువ స్థలం ఇస్తుందని చెబుతున్నారన్నారు. అది వచ్చాక ఇల్లు కట్టుకుంటామని, ప్రస్తుతం నిర్మాణాలు ఆపివేశారన్నారు. అటువంటి ప్రపోజల్ ఏమైనా ఉందా అని ప్రశ్నించారు. అయితే ఇప్పటికే పట్టా మంజూరైన వ్యక్తులకు మరోసారి రాదని, దీనిపై ప్రభుత్వం నుంచి మార్గదర్శకాలు రావాల్సి ఉందని గృహ నిర్మాణ శాఖాధికారులు తెలిపారు.
- తల్లికి వందనం పథకంలో 300 యూనిట్ల నిబంధనను ఏ ప్రాతిపదికన తీసుకున్నారో ప్రజలకు తెలియజేయాలని స్టాలిన్ కోరారు. అర్హత ఉండీ, పథకం వర్తించక పలువురు ఇబ్బందులు పడుతున్నారన్నారు. జేగురుపాడు జగనన్న కాలనీలో మరో బోరు నిర్మించాలని కోరారు.

నాడు-నేడు పనుల మాటేమిటి?

నాడు-నేడు పథకంలో భాగంగా కడియం, దుళ్ల గ్రామాల్లో పాఠశాలల్లో పెండింగ్‌లో ఉన్న పనులు ఎప్పుడు పూర్తవుతాయని వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి, కడియం ఎంపీటీసీ గిరజాల వీర్రాజు ప్రశ్నించారు. రైతు బజార్ నిర్మించేందుకు గత ప్రభుత్వ హయాంలో కేటాయించిన స్థలాన్ని విద్యుత్ సబ్ స్టేషన్ నిర్మాణానికి మార్పు చేశారు. రోడ్డు విస్తరణ అంశాలను పరిగణనలోకి తీసుకోవడంతో పాటు, ప్రజలకు నేరుగా ఉపయోగపడే నిర్మాణాలు ఆ స్థలంలో చేపడితే సమంజసంగా ఉంటుందన్నారు. సబ్‌స్టేషన్ కోసం లోపలకు ఉన్న స్థలాలను కేటాయించే అవకాశం పరిశీలించాలన్నారు.

- పంటల బీమా ప్రీమియాన్ని రైతులే చెల్లించాలని చెప్పడం కరెక్టు కాదని గిరజాల బాబు అన్నారు. గత ప్రభుత్వ హయాంలో రెండు పంటలకు బీమా సొమ్మును ప్రభుత్వమే చెల్లించిందని గుర్తు చేశారు.
- ప్రభుత్వ పాఠశాలల్లో డీ వార్మింగ్ మాత్రల పంపిణీ సక్రమంగా జరగడం లేదని, దీనిపై ఆరోగ్య శాఖాధికారులు దృష్టి పెట్టాలని దామిరెడ్డిపల్లి ఉపసర్పంచ్ ముద్రగడ జెమి సమావేశం దృష్టికి తెచ్చారు.
- వేమగిరి, జేగురుపాడు లేఅవుట్లలో తాగునీటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్య ఇప్పటికే ఆదేశించారని, ఆ మేరకు అధికారులు చర్యలు తీసుకుంటారని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ తెలిపారు. సభ్యులు సమావేశం దృష్టికి తీసుకువచ్చిన సమస్యలపై సంబంధిత అధికారులు సమాధానం చెప్పారు. ఎంపీడీవో కె.రమేష్, తహసీల్దార్ సునీల్, వైస్ ఎంపీపీలు పంతం గణపతి, విశాలాక్ష్మి, వివిధ గ్రామాల ఎంపీటీసీలు, సర్పంచ్‌లు పాల్గొన్నారు.

ఆకుల వీర్రాజుకు పలువురి పరామర్శ


ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి పుష్పాంజలి ఘటిస్తున్న మాజీ మంత్రి తోట నరసింహం తదితరులు

ఆల్కాట్‌తోట (రాజమహేంద్రవరం రూరల్): ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా సహకార కేంద్ర బ్యాంక్ (డీసీసీబీ) మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును బుధవారం పలువురు పరామర్శించారు. ఇటీవల వీర్రాజు మాతృమూర్తి ఆకుల ఈశ్వరమ్మ స్వర్గస్తులైన విషయం తెలిసిందే. మాజీ మంత్రి తోట నరసింహం, పెద్దాపురం వైఎస్సార్ సీపీ మాజీ కోఆర్డినేటర్ తోట సుబ్బారావు నాయుడు, ఏపీ గాండ్ల, తెలికుల కార్పొరేషన్ మాజీ చైర్మన్, వైఎస్సార్ సీపీ నగర మహిళా అధ్యక్షురాలు పోలు విజయలక్ష్మి తదితరులు ఆకుల ఈశ్వరమ్మ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆకుల వీర్రాజు, కుటుంబ సభ్యులను పరామర్శించి ప్రగాఢ సంతాపం తెలిపారు. వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి దూలం వెంకన్న బాబు, గుర్రం గౌతమ్, డీసీసీబీ మాజీ డైరెక్టర్లు పులి మధు, మోహిద్దిన్, వైఎస్సార్ సీపీ రూరల్ నియోజకవర్గ ఎస్సీసెల్ అధ్యక్షుడు చీకురుమిల్లి చిన్న, కోనసీమ పండ్ల వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు నిమ్మన లక్ష్మణరావు, మేడిచర్ల బాబ్జీ, ప్రముఖ బిల్డర్ బొర్లపూడి రవీంద్రకుమార్, బీజేపీ జిల్లా మాజీ అధ్యక్షుడు బొమ్ముల దత్తు తదితరులు ఆకుల వీర్రాజును పరామర్శించారు.

రాజమహేంద్రవరం రూరల్: డీసీసీబీ మాజీ చైర్మన్ ఆకుల వీర్రాజును సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్, మండల వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు ఉప్పులూరి వీరవెంకట సత్యనారాయణ, రాష్ట్ర యువకాపునాడు అధ్యక్షుడు ముద్దాల తిరుపతిరావు (అను), వైఎస్సార్ సీపీ దివ్యాంగుల సెల్ జిల్లా అధ్యక్షుడు ముత్యాల పోసికుమార్‌లు పరామర్శించారు.

ఉపాధ్యాయుడు 'గొల్లపల్లి' సేవలు ఆదర్శనీయం


గొల్లపల్లి సత్యనారాయణను సత్కరిస్తున్న ఎంపీపీ సత్యప్రసాద్, చిత్రంలో ప్రజాప్రతినిధులు, నాయకులు

కడియం: స్థానిక ఉన్నత పాఠశాల తెలుగు ఉపాధ్యాయుడు, రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గొల్లపల్లి సత్యనారాయణ సేవలు ఆదర్శనీయమని ఎంపీపీ వెలుగుబంటి సత్యప్రసాద్ అన్నారు. ఇక్కడి స్కూల్లో ఎనిమిదేళ్లు సేవలందించి అనపర్తి మండలం పులగుర్తకు బదిలీపై వెళుతున్న సత్యనారాయణను ఎంపీపీ, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు బుధవారం స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా గిరజాల బాబు మాట్లాడుతూ సొంత నిధులతో స్కూలుకు పలు సదుపాయాలు కల్పించారన్నారు. యాదల సతీష్‌చంద్ర స్టాలిన్ మాట్లాడుతూ ఆయన అంకిత భావం స్ఫూర్తిదాయకమన్నారు. కార్యక్రమంలో వివిధ గ్రామాల ప్రజాప్రతినిధులు, నాయకులు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు.

స్వర్ణాంధ్ర ఆశ్రమానికి అనాథ వృద్ధుడు


స్వర్ణాంధ్ర ఆశ్రమంలో చేరిన వృద్ధుడితో నిర్వాహకుడు రాంబాబు తదితరులు

రాజమహేంద్రవరం సిటీ: వేమగిరిలోని ఆంజనేయ స్వామి గుడి వద్ద మూడు నెలలుగా లేవలేని స్థితిలో ఉన్న మహదేవ్ హరేవా సావంకి అనే 68 ఏళ్ల వృద్ధుడికి స్వర్ణాంధ్ర ఆశ్రమంలో ఆశ్రయం కల్పించారు. గుడి వద్ద లేవలేని స్థితిలో ఉన్న అతడి పరిస్థితిని పారా లీగల్ వలంటీర్ ఎనమదల వెంకటేశ్వరరావు జిల్లా కలెక్టర్ గ్రీవెన్స్ దృష్టికి తీసుకువెళ్లి 108లో రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆసుపత్రిలో చేర్పించి వైద్య సహాయం అందించారు. అతడు పూర్తిగా కోలుకోలేనప్పటికీ ఆసుపత్రిలో ఉన్న ఇబ్బందుల దృష్ట్యా డిశ్చార్జ్ చేశారు. అతడిని ఎక్కడ ఉంచాలో తెలియక జిల్లా న్యాయ సేవాధికార సంస్థ సెక్రటరీ శ్రీలక్ష్మి ద్వారా స్వర్ణాంధ్ర వృద్ధాశ్రమంలో ఆశ్రయం కల్పించాలని కోరారు. దానికి నిర్వాహకుడు రాంబాబు అంగీకరించారు. మహారాష్ట్ర – కర్ణాటక సరిహద్దులోని పత్తర్వాడికి చెందిన మహదేవ్‌కు హిందీ, కన్నడ భాషలు అర్థం అవుతున్నాయి. కుటుంబ నిర్లక్ష్యమో ఏవైనా ఇబ్బందులు ఉన్నాయో తెలియదుగానీ వేమగిరి వద్ద ఆంజనేయస్వామి ఆలయానికి చేరాడు.

ఆ ఆశ్రమ నిర్వాహకులపై చర్యలు తీసుకోవాలి


సమావేశంలో మాట్లాడుతున్న వెంకట కృష్ణారావు

రాజమహేంద్రవరం సిటీ: వృద్ధులకు, అనాథలకు ఉచితంగా భోజనం, వసతి ఆశ్రయం కల్పిస్తామని చెప్పి అమ్మనాన్న వృద్ధాశ్రమం నిర్వాహకులు డబ్బు, బంగారం వసూలు చేస్తున్నారని చిట్యాల గ్రామానికి చెందిన గద్దె వెంకట కృష్ణారావు ఆరోపించారు. ఆయన బుధవారం ప్రెస్‌క్లబ్‌లో విలేకరుల సమావేశంలో మాట్లాడారు. ఆయన తెలిపిన వివరాల ప్రకారం.. కృష్ణారావు తన ఇల్లు అమ్మిగా వచ్చిన కొద్ది మొత్తంతో అమ్మనాన్న వృద్ధాశ్రమంలో చేరారు. తనకు వచ్చే నెల పెన్షన్‌ను నిర్వాహకులకు ఇచ్చేవారు. వృద్ధాశ్రమం నిర్వాహకులు పడగల ప్రసాద్ యాదవ్, అతడి కుమారుడు చైతన్య, అనుచరుడు బొల్లిన కృష్ణ మిగతా వృద్ధులు, మహిళల వద్ద నగదు, బంగారు ఆభరణాలు భద్రపరుస్తామని తీసుకునేవారన్నారు. కృష్ణారావు తన వద్ద ఉన్న 2.50 లక్షల్లో ఒక లక్ష రూపాయలను చైతన్యకు, మరో రూ.80 వేలను బొల్లిన కృష్ణకు ఇచ్చారు. అనంతరం తన డబ్బులు ఇవ్వాలని అడగడంతో ఆయనను దుర్భాషలాడి, కొట్టి వృద్ధాశ్రమం నుంచి గెంటివేశారు. దీంతో కలెక్టరేట్, జిల్లా ఎస్పీ కార్యాలయంలో కూడా కృష్ణారావు ఫిర్యాదు చేశారు. ఆశ్రమ నిర్వాహకులపై బొమ్మూరు పోలీస్ స్టేషన్‌లో కేసు పెట్టారు. అయితే పోలీసులు పట్టించుకోవడం లేదని విమర్శించారు.

నిబంధనలకు విరుద్ధంగా బదిలీలు


విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న శ్రీనివాసరావు

రాజమహేంద్రవరం సిటీ: రాష్ట్ర పశుసంవర్ధక శాఖలో ఉద్యోగుల బదిలీల విషయంలో నిబంధనలకు వ్యతిరేకంగా వ్యవహరిస్తున్న ఆ శాఖ సంచాలకులు డాక్టర్ దామోదర్ నాయుడుపై చర్యలు తీసుకోవాలని బీసీ, ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ ఎంప్లాయిస్ టీచర్స్ పెన్షనర్స్, వర్కర్స్ అసోసియేషన్ జేఏసీ ఆంధ్రప్రదేశ్ చైర్మన్ కేతా శ్రీనివాసరావు డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం రాజమహేంద్రవరంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇటీవల జరిగిన బదిలీలలో డాక్టర్ దామోదర్ నాయుడు ఇష్టారాజ్యంగా వ్యవహరించాలన్నారు. మూడేళ్ల సర్వీస్ పూర్తిచేసిన డాక్టర్ పద్మలీలను గాజువాక నుంచి తప్పించి ఆ పోస్టును వేరే వ్యక్తికి కేటాయించి ఎటువంటి పోస్ట్ ఇవ్వకుండా గాలిలో పెట్టారన్నారు. ఇదే విషయాన్ని దామోదర్ నాయుడును అడగగా పద్మలీల భర్త డాక్టర్ సురేష్‌ను కొట్టడానికి చెయ్యలేపడం చాలా బాధాకరమన్నారు. సమావేశంలో జేఏసీ ఏపీ స్టేట్ గౌరవ సలహాదారులు డీవీవీఎస్ఎన్ మూర్తి, జేఏసీ జిల్లా గౌరవ సలహాదారులు పెంకే శ్రీనివాస్ పాల్గొన్నారు.

అడ్మిషన్లలో నిబంధనలు బేఖాతరు


సమావేశంలో మాట్లాడుతున్న పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్

కంబాలచెరువు: ప్రభుత్వ నిబంధనలకు విరుద్ధంగా కార్పొరేట్ విద్యాసంస్థలు నూతన అడ్మిషన్ల ప్రక్రియ పూర్తి చేసుకున్నా విద్యాశాఖ అధికారులు పట్టించుకోకపోవడం దారుణమని పీడీఎస్‌యూ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కిరణ్ కుమార్ అన్నారు. స్థానిక పీడీఎస్‌యూ కార్యాలయంలో బుధవారం ముఖ్య నాయకుల సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కిరణ్ కుమార్ మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా పలు ప్రైవేటు విద్యాసంస్థలు విద్యా వ్యాపారానికి పాల్పడుతున్నాయన్నారు. పేదల నుంచి అధిక మొత్తంలో డొనేషన్ల పేరుతో ఫీజులు గుంజుతున్నాయన్నారు. అరకొర వసతులతో విద్యార్థులను ఇబ్బందులకు గురి చేస్తున్నాయన్నారు. ఇప్పటికైనా విద్యాశాఖ అధికారులు మేల్కొని విద్యాహక్కు చట్టం ప్రకారం నడుచుకోని ప్రైవేటు విద్యాసంస్థలపై తక్షణమే చర్యలు తీసుకోవాలన్నారు. లేనిపక్షంలో పీడీఎస్‌యూ ఆధ్వర్యంలో దశలవారీగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. సమావేశంలో పీడీఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రఫీ, ఉపాధ్యక్షులు భానుప్రసాద్, రూప శంకర్, రాష్ట్ర సహాయ కార్యదర్శి సిద్ధూ, నాగరాజు, శ్రీను పాల్గొన్నారు.

యోగా సాధనతో రుగ్మతలు దూరం


యోగాసనాలు వేస్తున్న డీఆర్‌వో సీతారామమూర్తి తదితరులు


యోగా సాధన చేస్తున్న మండల ప్రత్యేకాధికారి జ్యోతి, అధికారులు


యోగాంధ్రలో పాల్గొన్న నన్నయ వీసీ ప్రసన్నశ్రీ, ఆదిత్య విద్యాసంస్థల ప్రిన్సిపాల్స్, సిబ్బంది

సీటీఆర్ఐ: ప్రతి నిత్యం యోగా సాధన చేయడం వల్ల అనేక శారీరక, మానసిక రుగ్మతలకు దూరంగా ఉండవచ్చని జిల్లా రెవెన్యూ అధికారి (డీఆర్‌ఓ) టి.సీతారామమూర్తి అన్నారు. ఆర్ట్స్ కళాశాల సమీపంలో గ్రాంట్ ట్రంక్ రహదారిలో రెసిడెన్షియల్, ఆయుష్ శాఖ సిబ్బంది సంయుక్త ఆధ్వర్యంలో బుధవారం యోగా శిక్షణ నిర్వహించారు. ఈ సందర్భంగా డీఆర్‌ఓ మాట్లాడుతూ యోగా సాధనతో రక్త ప్రసరణ సాఫీగా జరిగి నాడీ వ్యవస్థ బాగా పనిచేస్తుందన్నారు. కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

విజయవంతం చేయాలి

రాజమహేంద్రవరం రూరల్: ప్రపంచ యోగా దినోత్సవం సందర్భంగా ఈ నెల 21న మండల స్థాయిలో జరిగే యోగాంధ్ర కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని రాజమండ్రి వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ మార్ని వాసుదేవరావు, మండల ప్రత్యేకాధికారి కేఎస్ జ్యోతి.. అధికారులను ఆదేశించారు. హుకుంపేట మండల పరిషత్ కార్యాలయంలో యోగాంధ్రపై బుధవారం సాయంత్రం మండల అధికారులతో సన్నాహక సమావేశం నిర్వహించారు. మార్ని వాసుదేవరావు, కేఎస్ జ్యోతి మాట్లాడుతూ యోగాంధ్ర కార్యక్రమంలో ప్రతి ఒక్కరిని భాగస్వాములు చేయాలన్నారు. హుకుంపేట డీమార్ట్ పక్కన ఖాళీ స్థలంలో ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. సమావేశంలో ఎంపీడీవో ఆర్మ్‌స్ట్రాంగ్, తహసీల్దార్ బి.శ్రీనివాసరావు, మండల పరిషత్ పరిపాలనాధికారి ఆకెళ్ల వరప్రసాద్, మండల విద్యాశాఖాధికారులు తులసీదాస్, చందుకుమార్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు. ముందుగా మండలపరిషత్ కార్యాలయ సమావేశ మందిరంలో ట్రైనర్ల పర్యవేక్షణలో మండల స్థాయి అధికారులు, ఉద్యోగులు యోగా సాధన చేశారు.

యోగాంధ్రలో ఎన్ఎస్ఎస్ వలంటీర్లు

కంబాలచెరువు: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం వైస్ ఛాన్సలర్ ప్రసన్న శ్రీ ఆధ్వర్యంలో బుధవారం జరిగిన యోగాంధ్ర 2025 కార్యక్రమంలో వెయ్యి మంది ఆదిత్య ఎన్ఎస్ఎస్ వలంటీర్లు పాల్గొన్నారు. కార్యక్రమానికి రూపకల్పన చేసిన ఆదిత్య ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం ఆఫీసర్, రెడ్ క్రాస్ కోఆర్డినేటర్ డాక్టర్ జీవీఎస్ నాగేశ్వరరావు మాట్లాడుతూ తాను ఎంతో కాలంగా యోగసాధనలో ఉంటున్నానని, దాని వల్ల కలిగిన ప్రయోజనాలు ఎన్నో ఉన్నాయన్నారు. ఆదిత్య కళాశాలల ప్రిన్సిపాల్స్ సీహెచ్ ఫణికుమార్, ఎస్‌కేఎస్.రెహమాన్, చంద్రశేఖర్, రామకృష్ణ మాట్లాడుతూ నిత్య జీవితంలో యోగా వల్ల కలిగే లాభాలను వివరించారు. యోగాంధ్ర 2025 నిర్వహించడంపై చైర్మన్ డాక్టర్ నల్లమిల్లి శేషారెడ్డి, ఆదిత్య విద్యాసంస్థల డైరెక్టర్ డాక్టర్ ఎన్.సుగుణారెడ్డి హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎన్ఎస్ఎస్ ప్రోగ్రామ్ ఆఫీసర్ బి.రమాదేవి, వైస్ ప్రిన్సిపాల్స్ కె.ఆనందరావు, పి.దుర్గాప్రసాద్, అధ్యాపక సిబ్బంది సోనుప్రసాద్, కె.ప్రసాద్ రాజు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ బలోపేతానికి కృషి


రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధి అలీ

రాజమహేంద్రవరం రూరల్: వైఎస్సార్ సీపీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానని ఆ పార్టీ రాష్ట్ర మైనార్టీ సెల్ అధికార ప్రతినిధిగా నియమితులైన కొంతమూరుకు చెందిన మీర్జా మౌలా అలీ అన్నారు. తనపై నమ్మకంతో మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఈ బాధ్యతలు అప్పగించారన్నారు. ఆయన నమ్మకాన్ని వమ్ము చేయకుండా చిత్తశుద్ధితో పార్టీకి సేవలు అందిస్తానని హామీ ఇచ్చారు.

30 లోపు ఈ-కేవైసీ చేయించుకోవాలి


ప్రభాకరరావు


రాజమహేంద్రవరం రూరల్: నియోజకవర్గంలో ఈ-కేవైసీ చేయించుకోని రైస్‌కార్డు లబ్ధిదారులు ఈనెల 30వ తేదీ లోపు చేయించుకోవాలని సివిల్ సప్లయిస్ రూరల్ డిప్యూటీ తహసీల్దార్ ప్రభాకరరావు అన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల ఆదేశాల ప్రకారం రైస్‌కార్డులో ఉన్న ప్రతి లబ్ధిదారుడు ఈ-కేవైసీ చేయించుకోవాలన్నారు. ప్రభుత్వం మంజూరు చేసే స్మార్ట్‌కార్డుల్లో ఈ-కేవైసీ చేయించుకోని కార్డులు రావన్నారు. కొందరు పిల్లల ఆధార్ అప్‌డేట్ చేయకపోవడంతో ఈ-కేవైసీ కావడం లేదన్నారు. వారందరూ సమీపంలోని ఆధార్ సెంటర్‌లో చేయించుకోవాలన్నారు. రేషన్‌షాపుల్లోని ఈపీవోఎస్, గ్రామ సచివాలయం సిబ్బంది వద్ద గల మొబైల్‌యాప్ ద్వారా ఈ-కేవైసీ చేయించుకోవచ్చన్నారు. మన మిత్ర వాట్సాప్ నంబర్ 95523 00009 ద్వారా మీ ఫోన్‌లోనే ఈ-కేవైసీ స్థితి తెలుసుకోవచ్చన్నారు.

యాంత్రీకరణతో లాభదాయక వ్యవసాయం


బొల్లెద్దుపాలెంలో వ్యవసాయ యంత్రాలను రైతులకు పంపిణీ చేస్తున్న అధికారులు

కోరుకొండ: యాంత్రీకరణతో లాభదాయక వ్యవసాయం చేయవచ్చని కలెక్టర్ పి.ప్రశాంతి అన్నారు. కోరుకొండ మండలం బొల్లెద్దుపాలెంలో బుధవారం రైతులకు యాంత్రీకరణ యూనిట్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో వ్యవసాయ యాంత్రీకరణ యూనిట్ల ఏర్పాటుకు సంబంధించి 211 రైతుసేవా కేంద్రాల పరిధిలో 675 యూనిట్లు గ్రౌండింగ్ చేశామన్నారు. వీటి ద్వారా రూ.3.58,27,637 సబ్సిడీ రూపంలో రైతులకు ఇస్తున్నట్టు తెలిపారు. ఈ యంత్రాలను రైతులు ఒకరికొకరు ఇచ్చుకుని వ్యవసాయ విస్తరణకు దోహదపడాలన్నారు. ప్రకృతి వ్యవసాయం సాగు విస్తీర్ణాన్ని పెంచాలన్నారు. అంతర పంటలపై కూడా రైతులు దృష్టి సారించాలన్నారు. బొల్లెద్దుపాలెం సర్పంచ్ కురుమళ్ల వెంకట రామారావు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో బొల్లెద్దుపాలెం ఎంపీటీసీ సభ్యురాలు అల్లి సింహాచలం, వ్యవసాయశాఖ జిల్లా అధికారి మాధవరావు, ఏడీ బీకే మల్లికార్జునరావు, ఏవోలు గౌరీదేవి, రాజరాజేశ్వరి, రామతులసి, వ్యవసాయశాఖ సహాయకుడు షిరోజ్ పాల్గొన్నారు.

జీవన ఎరువులపై అవగాహన


శిక్షణ కార్యక్రమంలో మాట్లాడుతున్న డాక్టర్ శ్రీనివాస్

రాజానగరం: పంట కోత అనంతరం మిగిలిన వ్యర్థాలు, అవశేషాలను సూక్ష్మ జీవుల కల్చర్‌తో కుళ్లబెడితే, తదుపరి పంటకు అది సేంద్రియ ఎరువుగా ఉపయోగపడుతుందని రాజమహేంద్రవరంలోని వ్యవసాయ కళాశాల ప్రొఫెసర్ డాక్టర్ డి.శ్రీనివాస్ అన్నారు. దీనిద్వారా ఆరోగ్యకర పంటలు పండించడంతో పాటు పర్యావరణ సమతుల్యతను కాపాడుకోవచ్చన్నారు. దివాన్ చెరువులోని జిల్లా ఏరువాక కేంద్రంలో కోనసీమ జిల్లాలోని 15 వ్యవసాయ సహకార పరపతి సంఘాల ప్రతినిధులకు ఇస్తున్న శిక్షణలో భాగంగా బుధవారం 'సూక్ష్మ జీవులకు సంబంధించిన జీవన ఎరువులు – విశిష్టత' అనే అంశంపై అవగాహన కలిగించారు. అలాగే జీవన ఎరువుల గురించి కళాశాల అసిస్టెంట్ ప్రొఫెసర్ బి.అనూష ప్రయోగాత్మకంగా వివరించారు. ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు డాక్టర్ చల్లా వెంకట నరసింహారావు, మానుకొండ శ్రీనివాస్ పర్యవేక్షణలో పది రోజులుగా ఈ కార్యక్రమం జరుగుతుంది.